## క్లుప్తంగా

### ఆలయాల చైర్మన్ల ఎన్నిక



రామాలయం నూతన చైర్మన్ అచ్చిరెడ్డి

చిలుకూరు : చిలుకూరు గ్రామంలోని పలు దేవాలయాల నూతన కమిటీ చైర్మన్లు, కమిటీ సభ్యులను శుక్రవారం ఎమ్మెల్యే పద్మావతి ఆమోదంతో ప్రకటించారు. పాత చిలుకూరు రామాలయం చైర్మన్‌గా అచ్చిరెడ్డి, కొత్త చిలకూరు రామాలయం చైర్మన్‌గా పాండూరి రమేష్, కాలువ ఒడ్డున గల అభయాంజనేయస్వామి ఆలయం చైర్మన్‌గా కొడారు వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆలయాల నూతన చైర్మన్లు మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

### కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు



సుమన్ చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందుకుంటున్న సిరిపురం విద్యార్థులు

నడిగూడెం : మండలంలోని సిరిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం గత మూడు సంవత్సరాలుగా ఆత్మరక్షణ కోసం విద్యార్థులకు ఉచితంగా కరాటేపై శిక్షణ ఇస్తోంది. ఈ శిక్షణలో ప్రతిభ చూపిన ఐదుగురు విద్యార్థులకు శుక్రవారం మిర్యాలగూడంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు, డాక్టర్ సుమన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యలమర్తి శౌరీ, ఉపాధ్యాయులు షాకీర్ మీర్జా భేగ్, కరాటే మాస్టర్ క్రాంతి పాల్గొన్నారు.

### గోమాతకు పూజలు



గోమాతకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో శుక్రవారం గోమాతకు పూజలు చేశారు. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, సహస్ర కుంకుమార్చన, ఆరాధన, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, మంగళాశాసనం, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ ఎంపి లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది గోవింద రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

### పెయింటర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

కోదాడ : కోదాడ పెయింటర్స్ (ఐఎన్‌టీయూసీ అనుబంధం) యూనియన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం కోదాడలో జరిగిన కార్యక్రమంలో ఎన్నికున్నారు. అధ్యక్షుడిగా ఎం. శ్రీనివాస్, కార్యదర్శిగా కామళ్ల రవికిరణ్, ఉపాధ్యక్షులుగా అమరబోయిన కనకారావు, మాదాసు వెంకటేష్, కోశాధికారిగా హనుమంతరావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ ప్రాంతీయ అధ్యక్షుడు పారా సీతయ్య మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సైదానాయక్, పాలూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### లయన్స్ క్లబ్ చేయూత



గొడుగు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలోని జాన్‌పహాడ్ రోడ్డులో ఎండలో కూర్చుని చెప్పులు కుట్టుతూ జీవనం సాగిస్తున్న కార్మికుడు చింతలచెరువు మోహన్‌కు లయన్స్ క్లబ్ గొడుగు అందజేసి చేయూతనిచ్చింది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, యడవెల్లి సత్యనారాయణరెడ్డి, జిలకర రామస్వామి, బట్టు మధు, సుంకరి క్రాంతికుమార్, సూర్యనారాయణరెడ్డి, విశ్వనాథ్, సైదులు, యూసుఫ్, లూకాస్ తదితరులు ఉన్నారు.

### మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

మునగాల : మోతె మండల కేంద్రం శివారులో సూర్యాపేట- ఖమ్మం జాతీయ రహదారిపై ఆటోను బస్సు ఢీకొన్న ప్రమాదంలో మృతిచెందిన ఆరుగురు కూలీల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మునగాలలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మృతిచెందిన ప్రతి కుటుంబానికి రూ.పదిలక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి గాయపడిన వారికి రూ.రెండు లక్షల ఆర్థికసాయం అందించి మెరుగైన ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దేవరం వెంకటరెడ్డి, మిట్టగణుపుల ముత్యాలు, జె.నరసింహారావు, మండల కార్యదర్శివర్గ సభ్యుడు షేక్ సైదా, గడ్డం వినోద్, దేవరం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

# భక్తజన సంద్రంగా బేతవోలు



బేతవోలులో కనకదుర్గమ్మ జాతరలో పాల్గొన్న గ్రామస్తులు, భక్తులు



జాతీయ స్థాయి ఎద్దుల పందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

**కనుల పండువగా కనకదుర్గమ్మ జాతర (బండ్ల పండుగ)**

- ఆలయంలో ప్రత్యేక పూజలు
- రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో పోటాపోటీగా కోలాట ప్రదర్శనలు
- ఎద్దుల పందేలు ప్రారంభం
- భారీ ఎత్తున తరలివచ్చిన భక్తులు

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో శుక్రవారం కనకదుర్గమ్మ జాతర వైభవంగా జరిగింది. ఊరి ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులు ఇళ్ల వద్ద అలంకరించిన ప్రభబండ్లను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు.

**పోటాపోటీగా ర్యాలీలు, కోలాట ప్రదర్శనలు**

కనకదుర్గదేవి జాతర సందర్భంగా రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శనలు పోటాపోటీగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శనను స్థానిక ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి.. ఎంపీపీ బండ్ల ప్రశాంతికోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్ర బాబు, మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ వట్టికూటి చంద్రకళనాగయ్య, పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంస్కృతీ, సంప్రదాయాలను మరచిపోకుండా పండుగలు నిర్వహించుకోవడం హర్షణీయమన్నారు. కాగా, బీఆర్‌ఎస్ నాయకులు రథశాల సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శనను ఆ పార్టీ నాయకుడు పచ్చిపాల వేణుయాదవ్.. పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ అక్కినపల్లి జానకీరామాచారి, తశ్లూరి శ్రీను, పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. సీపీఐ నాయకులు ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శనను ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. సీపీఎం నాయకులు ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శనను మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. కోలాట పోటీలకు ముందు పార్టీల ఆధ్వర్యంలో గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. కోలాట ప్రదర్శన చూసేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

**ఎద్దుల పందేలు ప్రారంభం**

బేతవోలులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఎద్దుల పందేలను శుక్రవారం ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ప్రారంభించారు. పందేలను జాగ్రత్తగా నిర్వహించుకోవాలని సూచించారు. కాగా, రెండు రోజుల పాటు ఎండ్ల పందేలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

**భారీ బందోబస్తు ఏర్పాటు**

జాతర సందర్భంగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, చిలుకూరు ఎస్‌ఐ సురభి రాంబాబుల ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు హెడ్‌కానిస్టేబుళ్లు, స్పెషల్ పార్టీ బలగాలతో మొత్తం 50 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధృవకుమార్, డిప్యూటీ తహసీల్దార్ కరుణ శ్రీ, ఎంపీడీఓ గిరిబాబు, ఎంపీటీసీలు వట్టికూటి ధనమూర్తి, నెమ్మాది సైదాబాబు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సీపీఎం ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన ప్రారంభించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

## ధరణిలో భూసమస్యలు పరిష్కరిస్తాం



ధరణిపై సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ ధృవకుమార్

చిలుకూరు : ధరణిలో ఉన్న భూ సమస్యలను నిబంధనల మేరకు పరిష్కరిస్తామని తహసీల్దార్ ధృవకుమార్ అన్నారు. శుక్రవారం చిలుకూరు తహసీల్దార్ కార్యాలయంలో ధరణీపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ధరణి సమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామాలైన చిలుకూరు, బేతవోలు, కొండాపురం, పాలెఅన్నారం గ్రామాలకు మూడు టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిలుకూరుకు తహసీల్దార్, బేతవోలు, కొండాపురం గ్రామాలకు డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ, పాలెఅన్నారం గ్రామాలకు సీనియర్ అసిస్టెంట్ శైలజ ఆధ్వర్యంలో ఆర్‌ఐలతో కలిసి టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## సమాజానికి సేవ చేయడం గొప్ప వరం



శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

గరిడేపల్లి : సమాజానికి సేవ చేయడం గొప్ప వరమని మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త పసుపుల మద్దిలేటి అన్నారు. శుక్రవారం గరిడేపల్లి మండలంలోని రాయినిగూడెం, కాల్వపల్లిలో హుజూర్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శీతాకాల ప్రత్యేక శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాంపు ద్వారా విద్యార్థుల్లో సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందని భవిష్యత్ నిర్మాణానికి ఎంతగానో ఉపయోగపడుతుందని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బీమార్జున్‌రెడ్డి, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు దొంతిరెడ్డి జానకిరెడ్డి, వెంకట్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ కురుమయ్య, ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీనివాసరావు, నగేష్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల జూనియర్ లెక్చరర్‌గా పలువురి ఎంపిక



మోతె : తల్లిదండ్రులతో బొర్ర సరిత



ఎ.సుధీర్



కస్తాల వెంకటరమణ

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన అమరవరపు సుధీర్ తెలంగాణ గురుకుల జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. దీంతో శుక్రవారం పట్టణంలో ఆయనను స్నేహితులు శాలువాతో సన్మానించారు. ఆయన గతంలో పంచాయతీ సెక్రెటరీగా వివిధ గ్రామాల్లో పనిచేసి ప్రస్తుతం రాయినిగూడెంలో విధులు నిర్వహిస్తున్నారు.

**రెండు ప్రభుత్వ ఉద్యోగాలు ఆమె సొంతం**

మోతె : మండలంలో సిరికొండ గ్రామానికి చెందిన బొర్ర వెంకన్న-మంగమ్మ దంపతుల కుమార్తె బొర్ర సరిత గురువారం విడుదలైన గురుకుల నియామక ఫలితాల్లో గురుకుల జూనియర్ కళాశాల లెక్చరర్‌గా ఎంపిక అయింది. అదేవిధంగా ఇటీవల విడుదలైన గురుకుల ఫలితాల్లో పీజీటీ (బయో సైన్స్)లోనూ ఉద్యోగం సాధించింది. కాగా, సరిత బొర్ర నడిగూడెంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో పదవ తరగతి వరకు, మట్టంపల్లి గురుకుల కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి హైదరాబాద్‌లో కోటి మహిళా యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేసింది. ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ (బోటనీ) పూర్తి చేసింది. వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో బీఈడీ చదివింది. గత మూడు సంవత్సరాలుగా ఔట్ సోర్సింగ్‌లో ఉద్యోగం చేస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమైంది. పేద కుటుంబానికి చెందిన సరిత ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో తల్లిదండ్రులు, బంధువులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేసి ఆమెను అభినందించారు.

**టీచర్ కావాలనే ఆశయంతో..**

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని హరిజనవాడకు చెందిన కస్తాల వెంకటేశ్వర్లు కూతురు కస్తాల వెంకటరమణ తెలంగాణ గురుకుల జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. ఆమె డిగ్రీ పూర్తి చేసిన తర్వాత బీఈడీ చేశారు. అనంతరం 2021లో ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ పూర్తి చేశారు. దీంతో పలువురు ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన తండ్రి కోరిక మేరకు టీచర్ అవ్వాలని ఆశయంతో లెక్చరర్‌గా ఉద్యోగం సాధించానని తెలిపారు.

### ఎంపీటీసీ నుంచి ఉపాధ్యాయురాలిగా..



జెట్టి ఇందిరమ్మ

మునగాల : ప్రజాప్రతినిధిగా ఉన్న ఓ మహిళ ప్రభుత్వ ఉపాధ్యాయురాలిలిగా ఎంపికైంది. మండలంలోని ముకుందాపురం ఎంపీటీసీ సభ్యురాలు నూకమళ్ల ఇందిర (జెట్టి ఇందిరమ్మ) శుక్రవారం విడుదల చేసిన టీజీటీ ఫలితాలలో మ్యాథ్స్ విభాగంలో ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించింది. మండలంలోని వెంకట్రాపురం గ్రామానికి చెందిన ఇందిరమ్మ 2011లో ముకుందాపురంనకు చెందిన నూకమళ్ల రామకృష్ణను వివాహం చేసుకుంది. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ఆమె భర్త రామకృష్ణ సహకారంతో టీటీసీ పూర్తిచేసి ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చదివింది. అనంతరం రెగ్యులర్‌లో బీఈడీ పూర్తిచేసి ఓపెన్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ మ్యాథ్స్ పూర్తి చేసింది. గురుకుల టీజీటీ పరీక్షకు హాజరైంది. కాగా 2019లో ఇందిరమ్మ టీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎంపీటీసీగా గెలిచి కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఇందిరమ్మ మాట్లాడుతూ తన భర్త సహకారంతో ఒక పక్క ఎంపీటీసీగా బాధ్యతలు నిర్వర్తిస్తూ విద్యను కొనసాగించానని తెలిపారు.

## వైభవంగా కనకదుర్గమ్మ జాతర



ప్రభబండ్ల ఊరేగింపులో ఎంపీటీసీ, గ్రామపెద్దలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని కరక్కాయలగూడెంలో కనకదుర్గమ్మ జాతర (బండ్లపండుగ)ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ ట్రాక్టర్లకు ప్రభలను అలంకరించి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. అనంతరం ట్రాక్టర్లను ఆలయం వద్ద వదిలి వన భోజనాలకు వెళ్లారు. శనివారం ప్రభ బండ్లను ఇంటికి తీసుకెళ్లడం ఇక్కడి ఆచారం. ఈ సందర్భంగా ఎంపీటీసీ మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కనకదుర్గమ్మ దీవెనలతో గ్రామ ప్రజలు పాడి పంటలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొంగరి అరుణసత్యనారాయణ, అంకతి ప్రభాకర్, బత్తిని మాధవరావు, శ్యామ్‌సుందర్, శ్రీనివాస్, లింగయ్య, వెంకయ్య, మహేష్, సైదయ్య, వీరయ్య, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

### విజయ సంకల్ప యాత్రకు ఘన స్వాగతం



విజయ సంకల్ప యాత్రకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

మునగాల : బీజేపీ తలపెట్టిన విజయ సంకల్ప యాత్ర శుక్రవారం మునగాలకు చేరుకుంది. దీంతో బీజేపీ మండల అధ్యక్షుడు భద్రంరాజు కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో యాత్రకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు రెబోతు శ్రీనివాసరెడ్డి, వేముల వీరబాబు, యూత్ అధ్యక్షుడు పనస కోటేష్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాసరి మధు, నాయకులు కృష్ణమూర్తి, గోపి, వెంకటేష్, అంజి, శ్రీను పాల్గొన్నారు.

### నేడు పీఏసీఎస్ చైర్మన్ ఎన్నిక

గరిడేపల్లి : మండలంలోని రాయినిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్ ఎన్నికను శనివారం కీతవారిగూడెంలోని పీఏసీఎస్‌లో నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జట్టుకొండ సత్యనారాయణ తెలిపారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో రావాలని కోరారు.

## ఉత్తమ్ సహకారంతో అభివృద్ధి పనులు



తుమ్మలతండాలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న మంజీనాయక్

మఠంపల్లి : మండలంలోని గ్రామ పంచాయతీల పరిధిలో గల తండాలు, ఆవాస గ్రామాల్లో రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తుమ్మలతండాలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నవీన్‌నాయక్, కరీమ్, భీముడు నాయక్, భాస్కర్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీను నాయక్, మగతానాయక్, కోటేశ్వరరావు, సైదానాయక్ తదితరులు పాల్గొన్నారు.

### కమలానగర్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని శాంతినగర్ నుంచి కమలానగర్ వరకు రోడ్డు అధ్వానంగా ఉందని, తక్షణమే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని క్రాంతినికేతన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, పెంచికల్‌దిన్న మాజీ సర్పంచ్ సుంకరి క్రాంతికుమార్ కోరారు. శుక్రవారం స్థానికంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ రహదారిపై 10 గ్రామాలకు వెళ్తుంటారని, రోడ్డు గుంతలమయంగా మారడంతో పాదా చారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అభివృద్ధి నిధులతో రోడ్డు మరమ్మతులు చేపట్టాలని అధికారులను, మున్సిపల్ పాలకమండలిని కోరారు.

### పాండునాయక్ మృతి గిరిజన జాతికి తీరని లోటు

గరిడేపల్లి : మండలంలోని లచ్యాతండా తాజా మాజీ సర్పంచ్ పాండునాయక్ అకాల మృతి గ్రామానికి, గిరిజన జాతికి తీరని లోటని ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణనాయక్, పీఏసీఎస్ చైర్మన్ వీరంరెడ్డి శంభిరెడ్డి అన్నారు. శుక్రవారం పాండునాయక్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

### పరీక్ష సామగ్రి అందజేత



విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న వంశీ

నడిగూడెం : మండలంలోని కాగితరామచంద్రాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం పూర్వ విద్యార్థి బాణాల వంశీ పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్.ఇమామ్, బాణాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు అజ్మతుల్లా, సైదా తదితరులు పాల్గొన్నారు.

### అర్హులకు రేషన్‌కార్డులు మంజూరు చేయాలి

మఠంపల్లి : ప్రభుత్వం అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి మాళోతు బాలునాయక్ కోరారు. శుక్రవారం మఠంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను రేషన్ కార్డు ఉన్నవారికే అందజేస్తున్నందున రేషన్ కార్డులు లేని పేదలు నష్టపోతారని తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు రన్మియా, రాము, కోటయ్య, తదితరులు ఉన్నారు.

### కార్మికులు వెల్ఫేర్ బోర్డు కార్డు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ సైదా

హుజూర్‌నగర్ : భవన నిర్మాణ కార్మిక సంఘం, తదితర రంగాల్లో పనిచేస్తే కార్మికులు వెల్ఫేర్ బోర్డు కార్డు తీసుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు షేక్ సైదా అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన ఆ సంఘం సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్డులు కలిగి ఉన్న కార్మికులు వాటిని రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. కార్డులు లేకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను పొందలేరని తెలిపారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు బి.శ్రీనివాస్‌రెడ్డి, వినాయకరావు, ఏలియా, మన్యం సైదులు, రాధారెడ్డి, దాసరి రాంబాబు, నరేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మోతె : మండలంలోని నర్సింహాపురం గ్రామ పరిధిలో పాలేరు వాగు నుంచి శుక్రవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను మోతె ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి పట్టుకొని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలోని పాలేరు వాగు నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే వాల్టా చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఘనంగా మాదిగ అమరవీరుల దినోత్సవం



నడిగూడెంలో కొవ్వొత్తులతో అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు



నేరేడుచర్లలో అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నడిగూడెం : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సంఘం (ఎంఈఎఫ్) జిల్లా నాయకుడు పాతకొట్ల ప్రకాష్, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు మిట్టగణుపుల మోష, ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకుడు పందిటి నవీన్‌కుమార్, నాయకులు రవి, శ్రీకాంత్, శ్యామ్, మహేష్, వంశీ, నమ్రత్ పాల్గొన్నారు.

**ఎస్సీ వర్గీకరణకు పోరాడాలి**

కోదాడ : ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడి అమరులైన మాదిగల ఆత్మకు శాంతి కలగాలంటే వర్గీకరణ సాధించే వరకు విశ్రమించకుండా పోరాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క ఎమ్మార్పీఎస్ కార్యకర్త, నాయకులపై ఉందని ఎమ్మార్పీస్ నాయకులు ఏపూరి రాజు, వడ్డేపల్లి కోటేష్ అన్నారు. శుక్రవారం కోదాడలో మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సత్యరాజు, ఏసోబు, సూరి, కనకయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

**అమరవీరుల ఆశయాలు సాధిస్తాం**

గరిడేపల్లి : మాదిగ అమరవీరుల ఆశయాలను సాధిస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మంద భిక్షం అన్నారు. శుక్రవారం గరిడేపల్లి మండలంలోని కల్మలచెరువు రోడ్డులో మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పిట్ట పిచ్చయ్య, పిట్ట రామకృష్ణ, బుడిగె లాజర్, మైసయ్య, రమేష్, శ్రీను, కోటయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**ఎస్సీ వర్గీకరణకు మాదిగలు ఉద్యమించాలి**

నేరేడుచర్ల : ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు ఐక్యంగా ఉద్యమించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యడవెల్లి అరుణ అన్నారు. మాదిగల అమరవీరుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం నేరేడుచర్లలో అమరవీరులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఇంజమూరి పున్నయ్య, మీసాల సురేష్, ఉబ్బపల్లి సైదులు, భిక్షం, కాంతయ్య, వెంకన్న, చందు, నగేష్, జాను, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

### సీఐటీయూలోకి అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు



సీఐటీయూలో చేరిన అంగన్‌వాడీ వర్కర్లు

గరిడేపల్లి : మండల కేంద్రంలో పలువురు అంగన్‌వాడీ వర్కర్స్, ఆయాలు శుక్రవారం సీఐటీయూ జిల్లా నాయకుడు యాకూబ్ సమక్షంలో సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా యాకూబ్ మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం మూలన ఐసీడీఎస్ నిర్వీర్యమైందన్నారు. ఎనిమిది ఏళ్లుగా అంగన్‌వాడీ టీచర్లను, ఆయాల సమస్యలను పాలకులు పట్టించుకోలేదని తెలిపారు. కార్మికుల పక్షాన సీఐటీయూ పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సరిత, శ్రీలక్ష్మి, పుష్ప, గురువమ్మ, అశ్విని, వెంకటమ్మ, భవానీ, నాగమణి, రాణి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

### మేరమ్మ సేవలు చిరస్మరణీయం



మేరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నడిగూడెం : మాజీ పీసీసీ సభ్యురాలు దివంగత గొబ్బి మేరమ్మ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నారు. శుక్రవారం చెన్నకేశ్వాపురంలో నిర్వహించిన సంస్మరణ సభలో వారు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వేపూరి తిరుపమ్మ, మండల ఉపాధ్యక్షుడు దున్నా శ్రీను, గ్రామ శాఖ అధ్యక్షుడు కటికల పుల్లయ్య, మాజీ ఉప సర్పంచ్ ఉపేందర్, సీనియర్ నాయకులు గుజ్జర్లపూటి అర్జునరావు, తుమ్మల సుబ్బారావు, అంజి, వీరయ్య, విజయ రామారావు, శ్రీను, అంబేద్కర్ పాల్గొన్నారు.

### కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలు

హుజూర్‌నగర్ : పట్టణంలో ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. రెండు పరీక్షా కేంద్రాల్లో శుక్రవారం పరీక్షకు 599 విద్యార్థులకు గాను 33 మంది గైర్హాజరు కాగా 566 మంది హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 253 మంది విద్యార్థులకు 19 మంది గైర్హాజరు కాగా 234 మంది హాజరయ్యారు. ప్రియదర్శినీ కళాశాలలో 356 మంది విద్యార్థులకు 14 మంది గైర్హాజరు కాగా 342 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు.



పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు